

ప్రజలకు అభివాదం చేస్తున్న మల్లారెడ్డి





బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్‌గౌడ్



ఎన్నికల ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్ ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

అభివృద్ధి చేశాం.. హ్యాట్రిక్ సాధిస్తాం

మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో అన్ని విధాలా అభివృద్ధి చేశారని, సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నివర్గాల వారికి మేలు చేశారని అందుకే బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా చరిత్రలో నిలవడం ఖాయమని మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి, రాయిలాపూర్, శ్రీరంగవరం, డబిల్‌పూర్ గ్రామాల్లో, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లి, గిర్మాపూర్, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మహిళా గర్జనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు ఎవరూ చేయలేని విధంగా సీఎం కేసీఆర్ పనులు చేశారని తెలిపారు.

◆ కాంగ్రెస్ హయాంలో కరెంట్ కోతలు, రైతుల వెతలు ఉండేవని, బీఆర్ఎస్ పాలనలో రైతులు సాగునీరు, రైతు బంధు, రైతుబీమా వంటి ఎన్నో పథకాలతో వారిని ఆదుకున్నామన్నారు. పేదల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సొంత నిధులు వెచ్చించి రోడ్లు వేయించిన మల్లారెడ్డిని మరోమారు గెలుపించుకుంటామని ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు.

◆ 30వ తేదీన పెద్ద ఎత్తున ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, మున్సిపల్ చైర్మన్లు దీపిక, కొకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు విజయానంద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

గతంలోనే ఎస్సీ వర్గీకరణ కోసం తీర్మానం చేశాం..

తెలంగాణలో దళితులను ధనికులుగా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, ఎస్సీ వర్గీకరణ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడారు. దళితులకు దళిత బంధు ఇవ్వడం కేవలం సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. దళితులు ఉన్నత చదువులు చదువుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. దళితులందరూ బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పాపయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన ముస్లిం కమ్యూనిటీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కీసర మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

తూంకుంట మున్సిపాలిటీ చెందిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి నూనెముంతల రవీందర్‌గౌడ్ ఆదివారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నాడు. మంత్రి మల్లారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు, యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామానికి చెందిన పలువురు మహిళా నాయకులు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల్లో చెందిన యువకులు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

పాల డబ్బాల సైకిల్ బహూకరణ...

ఎన్నికల ప్రచారంలో భాగంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలో నిర్వహించిన ప్రచారంలో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మండల ఈశ్వరయ్య, మండల రవికుమార్ మంత్రి మల్లారెడ్డికి పాల డబ్బాలు, సైకిల్ బహూకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు లొంగొద్దు



మాట్లాడుతున్న కామన్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు అంజనేయులు

పోచారం: రాజకీయ పార్టీల ప్రలోభాలకు లోనవకుండా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనాలని కామన్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కళ్లెం అంజనేయులు అన్నారు. ఆదివారం ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని నవదుర్గనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కత్తి కంటే పదునైన ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కును వినియోగించుకొని సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలను కాకుండా పనిచేసే నాయకుడికే పాలించే అవకాశం ఇవ్వాలన్నారు. ఓటు విలువ గురించి తెలపడానికి, ఓటింగ్ శాతం పెంచడానికి కామన్ సిటిజన్ ఫోరం గడపగడపకూ వెళ్లి అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి మాన్‌సింగ్, నవదుర్గనగర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ కుమార్, నారాయణాద్రి కాలనీ ప్రతినిధులు జి.శివ, ఎం.నవీన్, హైకోర్టు అడ్వకేట్ చక్రవర్తి, సప్తగిరి కాలనీ అధ్యక్షుడు చిన్నపరెడ్డి, యూత్ నాయకుడు గౌరిగే శ్రీను, ఇతర ప్రతినిధులు సాయిరాం, సాంబయ్య, దినేష్, దాస్, రాము, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయం

పార్టీ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి



బోడుప్పల్: మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తోందని ఆ పార్టీ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం నిర్వహించిన మహిళా గర్జనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో ప్రగతి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారని, ఆయన హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలికి కొట్టుకుపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి, అక్రమాలు తప్ప అభివృద్ధి జరగదన్నారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్యను వంద శాతం బీఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. బోడుప్పల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను పూర్తి చేస్తామన్నారు. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్, బీఆర్ఎస్ మహిళ విభాగం నాయకురాలు చామకూర ప్రీతిరెడ్డి, కార్పొరేటర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్‌కుమార్



మేడ్చల్‌రూరల్: తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మేడ్చల్‌కు చెందిన ప్రేమ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలో ఎస్‌టీయూటీఎస్ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 33 జిల్లాల బాధ్యులు సమావేశంలో పాల్గొనగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలి



ఘట్‌కేసర్: అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎమ్మార్ ట్రస్ట్ సభ్యుడు శ్రీశైలంరెడ్డి అన్నారు. ఆదివారం భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూలమాల సమర్పించి మాట్లాడారు. భారతదేశాన్ని ప్రపంచపటంపై నిలబెట్టిన ఘనత అంబేడ్కర్‌కే దక్కిందన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, దాసు, మల్లేశ్, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలోని శ్రీచైతన్య, రిషి జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక నారాయణ గార్డెన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ పద్మారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు, తల్లిదండ్రుల సూచనల మేరకు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల డైరెక్టర్ బాబుల్‌రెడ్డి, రిషి కళాశాల ప్రిన్సిపల్ రవీందర్‌రెడ్డి అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలుచోట్ల ఆదివారం ఎక్సైజ్ సీఐ నవనీత ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. గుండ్లపోచంపల్లిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినట్లు తెలుసుకున్న పోలీసులు దొడ్ల నవీన్‌కుమార్ ఇంట్లో దాడులు నిర్వహించి 43 మద్యం బాటిళ్లు, మేడ్చల్ పట్టణంలోని చెరువుకొమ్ము సాయి కమల్ ఇంట్లో 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని సీఐ నవనీత హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ రాఘవ, యూసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి

● జిల్లా ఎన్నికల అధికారికి టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి

సాక్షి, మేడ్చల్ జిల్లా: విధి నిర్వహణలో భాగంగా ఎన్నికల సమయంలో న్యూస్ కవరేజ్‌కు వెళ్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారికి టీయూడబ్ల్యూజే విజ్ఞప్తి చేసింది. ఈమేరకు ఆదివారం కలెక్టరేట్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం శామీర్‌పేటలో ఓ రిసార్ట్‌లో ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరిపై బీఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. మేడ్చల్ మండలంలో కూడా జర్నలిస్టులపై దాడులు జరగడం విచారకరం అన్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు తగిన సూచనలతో.. సర్క్యులర్ పంపించాలని సంబంధితులకు ఉత్తర్వులు ఇచ్చారు. శామీర్‌పేట్‌లో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నివేదికని ఇవ్వాలని ఆర్వోకు సూచించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, బాధితులు పాల్గొన్నారు.

ఈ నెలాఖరుతో అంతా కాంగ్రెస్సే..



సభకు హాజరైన ముఖ్యనేతలు, మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

- మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్
- జవహర్‌నగర్‌లో 2 వేల మంది కాంగ్రెస్‌లో చేరిక
- కమ్మ సంఘం కార్తీక వనభోజనాల్లో వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి
- జవహర్‌నగర్, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్‌లలో పర్యటన

శామీర్‌పేట్: మంత్రి మల్లారెడ్డికి ఓటమి భయం పట్టుకుందని కోట్ల రూపాయలు వెదజల్లి ఓట్లను కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యాడని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి మంత్రి మల్లారెడ్డి అక్రమంగా కూడబెట్టిన సంపాదనను వెదజల్లి ఓట్లను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ఆరోపించారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అనంతరం జవహర్‌నగర్‌లో సుమారు 2 వేల మంది ముస్లిం యువకులు, రజక సంఘం సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు.

ఘట్‌కేసర్‌లోని పలు ప్రాంతాల్లో..

ఘట్‌కేసర్ మండలంలోని ఘనాపూర్, ప్రతాపసింగారం, కాచవానిసింగారంలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. కాంగ్రెస్ గెలిచిన అనంతరం పేద మహిళలకు నెలకు రూ.2,500, పేద యువతి వివాహానికి ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్, గ్యాస్ సిలిండర్‌ను రూ.500లకు అందజేస్తామని, నిరుద్యోగుల కోసం 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

కార్తీకమాస వనభోజన కార్యక్రమంలో..

దమ్మాయిగూడలో కమ్మసంఘం ఆధ్వర్యంలో కమ్మవారి కార్తీక మాస వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. చేయిగుర్తుపై ఓట్లు వేసి మేడ్చల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.



సభకు హాజరైన మహిళలు



కమ్మవారి కార్తీక మాస వనభోజనంలో వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి

మరోసారి అవకాశం ఇవ్వండి



అల్వాల్: అల్వాల్ అయ్యప్ప నగర్ వజ్ర ఎన్‌క్లేవ్ భవానీనగర్‌లో కాలనీవాసులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి పనులను జోరుగా కొనసాగిస్తామన్నారు.

ఆహారంలో రుచితో పాటు నాణ్యత పాటించాలి



అల్వాల్: మెరుగైన సేవలు అందజేయడంతో పాటు నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించి వారి మన్ననలు పొందాలని అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాత అల్వాల్‌లో యతి బి4 వరల్డ్ క్లాస్ హాస్పిటాలిటీ ప్రైవేటు లిమిటెడ్ వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన యతి మిలటరీ హోటల్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రారంభించారు. హోటల్స్ నిర్వాహకులు లక్ష్మీకాంత్, ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ లిమిటెడ్ సీఈఓ ప్రవీణ్ నెడుంగడీ, ఆహార్ హోటల్ యజమాని రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఎర..

- పెరిగిన ప్రలోభాల జోరు
- నగర శివారు హోటళ్లు, రిసార్టుల్లో ఆత్మీయ సమ్మేళనాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు రోజులు మాత్రమే ఉంది. ఈ కొద్ది సమయం అన్ని పార్టీల అభ్యర్థులకు ఎంతో కీలకం. ఎలాగైనా ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని బహుముఖ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యర్థుల కంటే ముందే ఆకట్టుకోవాలనే లక్ష్యంతో జిల్లాలో అన్ని పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. బస్తీలు, వార్డులు, డివిజన్లు, కాలనీలు, అపార్టుమెంట్లు, గ్రామాలు, సామాజిక వర్గాల వారీగా తాయిలాలు ప్రకటిస్తూ వారికి కావాల్సింది చేస్తూ.. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పోటాపోటీగా సభలు, రోడ్డు షోలు, పాదయాత్రలకు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి జనాలను సమీకరిస్తున్నారు. సాయంత్రం అయ్యే సరికి ఎవరెవరికి ఏమేమి అవసరమో సమకూరుస్తున్నారు. బిర్యానీ పొట్లాలు, మందు సీసాలు విరివిగా లభిస్తున్నాయి. తాయిలాలు సమకూరుస్తూ విజయం తమదేనంటూ అభ్యర్థులు ఎవరికివారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు.. చేరికలు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 126 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు కాస్తో కూస్తో ప్రభావం చూపించే చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు బరిలో ఉన్నారు. దీంతో పోటీ తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు గెలవాలనే పట్టుదలతో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు. నగర శివారుల్లోని హోటళ్లు, రిసార్టులు, కమ్యూనిటీ హాళ్లలో సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మీకేం కావాలో చెప్పండి.. మీ వర్గం ఓట్లన్నీ మాకే వేయండి.. అంటూ తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. హాజరైన వారందరికీ బిర్యానీ వంటి రుచికర భోజనాలు వడ్డిస్తున్నారు. అలాగే.. ఇతర పార్టీ నుంచి వారి పార్టీలోకి వచ్చి కండువా వేసుకునే వారి లెక్కలు వేరేగా ఉన్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు ముందుగా వారితో చర్చలు కండువాలు వేయించి, రూ.వేలు ముట్టచెబుతున్నట్లుగా సమాచారం. పార్టీల అభ్యర్థులు బలంగా ఉన్న చోట ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదనేది వినిపిస్తున్న మాట.

తాయిలాలు అందజేస్తూ..

ఇంటింటికీ పార్టీ గుర్తు బ్యాలెట్ పేపరుతో పాటు క్యాలెండర్లు, క్రికెట్ ఇతర ఆటల సామగ్రి అందజేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకొని వారికి అందజేస్తున్నారు. ప్రచారం కోసం వచ్చే వారికి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అందజేస్తున్నారు. రాత్రివేళ మద్యం సీసాలు పంపిస్తున్నారు. పలువురు అభ్యర్థులు ఓటుకు నోటు, మద్యం సీసాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందుకోసం ఆయా బస్తీలు, వార్డులు, డివిజన్లు, గ్రామాల్లో ఇతర పార్టీల వారు అనుమానించని నాయకుల ఇళ్లకు మద్యం కేసులు, డబ్బు సంచులు తరలించారనే చర్చ సాగుతోంది. బస్తీలు, కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లోని డిగ్రీ విద్యార్థులకు విందు, మందులతో గాలం వేస్తున్నారు. దీనివల్ల కొత్తగా కొందరు యువకులు మద్యానికి అలవాటు పడుతున్నారు. ఓటర్ల కోసం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. గంప గుత్తగా వలస ఓటర్లను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు ఓటు వేసేందుకు వస్తే.. రాను, పోను రవాణా ఖర్చు, కొంత డబ్బును అందించేలా ద్వితీయశ్రేణి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బోడుప్పల్‌లోని వక్ఫ్ బోర్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, రాపోలు రాములుతో కలిసి ఆయన రాజశేఖర్ కాలనీ, దేవేందర్‌నగర్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఆర్ఎన్ఎస్ కాలనీ, మారుతీనగర్ కాలనీవాసులతో వక్ఫ్ బోర్డు సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి ఎలాంటి సమస్య లేకుండా నివాసం ఉంటున్న కాలనీవాసులకు వక్ఫ్ బోర్డు సమస్యను బీఆర్ఎస్ క్రియేట్ చేసి కాలనీ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. మంత్రి మల్లారెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలేయడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, ఈ ఎన్నికల్లో ఆయన ఓటమి ఖాయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు రాసాల వెంకటేశ్‌యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, తోటకూర అజయ్‌యాదవ్, పులకండ్ల జంగారెడ్డి, దానగల్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయం



ఉప్పల్: సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఉప్పల్ స్వతంత్ర అభ్యర్థి అమిరిశెట్టి దేవేందర్ అన్నారు. ఆదివారం ఉప్పల్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. డోలె గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు సేవ చేశానని, ఉచితంగా పేదలకు న్యాయం విషయంలో సహకరించానన్నారు. తనలాంటి నిస్వార్థ సేవకులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన



బోడుప్పల్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ స్కూల్ విద్యార్థులు ఓటు హక్కుపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులు పాల్గొని ఓటు హక్కు మన హక్కు అంటూ నినాదాలు చేస్తూ చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు సామాన్య మానవుడి ఆయుధమని, తమకు సేవ చేసే నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని సూచించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతి, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.